
మారేమండ
సీతారామయ్య




స్వంత ఇంట్లో అచ్చమైన అక్కళ్ళ అన్నానికీ, ఘాటు ఆవకాయకూ అలవాటుపడ్డ నేను కొన్నాళ్ళపాటు మెరైన్ డ్రైవ్ హోటల్లో చపాతీలు, మసాలా, ఆలూ ఆరగించవలసివస్తుందని, నరిసీ పట్నం కాలవ ఒడ్డు రెల్లు దిబ్బల మీద దొర్లిన నేను 'టెర్రేస్ గార్డెన్' పచ్చ గడ్డిలో తిరగాడవలసి వస్తుందని ఊహించలేకపోయాను. విశాలమైన పదిగదుల ఇంట్లో ఇరవై రెండేళ్ళు కాలం ఖర్చుచేసిన నాకు ఒకానొక అంబదంతస్తుల బిల్డింగులో ఇరవై తొమ్మిదవ వాటాలో వంటింట్లో కాలం వృథాచేసే అదృష్టం పడుతుందనీ ఊహించలేకపోయాను. ఆ జ్యోతిష్యం ముందే తెలిస్తే మరాఠీ అభ్యసించి 'ఎడ్జెస్టుమెంటు' నేర్చుకుని బొంబాయి నగరంలో కాలు పెట్టేవాణ్ణి. ఆ మహానగరంలో రంగు రంగుల గళ్ళ లుంగీలతో, మొగల్ సామ్రాజ్య కాలపు నాటి చొక్కాలతో, మెడలో రుద్రాక్ష మాలలతో ఆహో, మగో తెలియని స్థితిలో వకవకా సాగే యువతరం


నన్ను పెద్దగా ఆకర్షించి ఓ కథకు ఉద్దీపన కాలేదు. బారులుగా సాగే కార్లని, పాములల్లా మెలికలు తిరిగే జన సందోహాన్ని, హడావిడిగా పరుగెత్తే డబుల్ డెక్కర్లని చూసి నేను కొంత బెదిరిన మాట నిజమే కాని,అవి ఏ కథకు బీజం కాలేకపోయాయి. కళ్ళు మిరుమిట్లు గొల్పే లైట్లతో ముస్తాబయిన షాపులు, అందాలు ఉట్టిపడే షో కేసులు, ఆకాశాన్ని పెళ్ళే కట్టడాలు నాకు ఆనందాన్ని కలిగించాయి కాని, నా చేత కాగితం మీద కలం పెట్టించలేకపోయాయి. ఆ హడావిడి ప్రపంచంలో మరే ఇతర భాషలలో మిశ్రమం కాకుండా మోగిన ఓ తెలుగు గొంతు నా పాలికి వదును పెట్టింది.

ప్రతి రోజు లాగే ఆ రోజూ ఆఫీసుకు వెళ్ళేందుకు చర్చి గేటు వెళ్ళే ఎలెక్ట్రిక్ ట్రెయిన్ ఎక్కి కూర్చున్నాను. ఆ టైమ్‌లో ట్రెయిన్ ఊపిరాడనంత రష్‌గా ఉంటుంది. ఆ రష్‌లోనే ఇహలోక సౌఖ్యం మీద గురి ఉన్న మరాఠీ అన్నయ్యలు నలుగురు ఓ గుంపుగా చేరి బ్రీఫ్ కేసు మీద పేక ముక్కలు పరుచుకుని, చతుర్ముఖ పారాయణ భారీ ఎత్తున సాగిస్తున్నారు. మరో నలుగురు తామే ఆడుతున్నంత సంబరంగా పంపో లిస్తున్నారు. పరలోక సౌఖ్యం మీద మోజున్న మరి కొంతమంది భక్త వతం సులు తాళాలు, చిడతలు చేపట్టి అత్యున్నత స్థాయిలో భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ట్రెయిన్ స్టేషన్లో ఆగినప్పుడల్లా ఆ కంపార్ట్మెంటులోంచి బయటి కొచ్చిన ఓ చెయ్యి ప్రసాదం పంచి పెడుతూంది. తమిళ సోదరులు మద్రాసు పట్టణ ఔన్నత్యాన్ని పొగుడుతున్నారు. ఇంతలో చివర్నుంచి కొంచెం బొంగురుగా రాగాలకీ, తాళాలకీ, శ్రుతులకీ, మరి దేటికీ కట్టుబడని ఓ కంఠం పాట పాడుతూంది తెలుగులో . . .

'గోదారి గట్టుంది గట్టుమీదా
పెట్టుంది'

ఆ పాట విన సొంపుగా లేదు. కాని, తెలుగు పాట!

ఆ పాట పాడే వ్యక్తిని చూడాలని శత విధాలా ప్రయత్నించాను. చుట్టు ముట్టి తోసుకుంటూ ఎక్కి దిగే జనం నా ప్రయత్నాన్ని కొనసాగనివ్వలేదు. పాట కొంచెం కొంచెం దగ్గరగా వినిపిస్తూంది. అంటే, ఆ కంఠం ఇటే వస్తూందన్న మాట! ఓపిగ్గా ఎదురుచూడడం మొదలెట్టాను. ఇంతలో చర్చిగేటు స్టేషన్ వచ్చేసింది. పాలోమని జనం దిగిపోతున్నారు. కలిసిపోయిన ఆ జనంలో నాకు కావలసిన వ్యక్తి కలిసిపోయాడు. నేమా




ట్రెయిన్ దిగి కొద్దిసేపు మనుషుల మొహాలు చూస్తూ గడిపాను. అనంతమైన ఆ ప్రవాహంలో నే వెదికే చిరు కెరటం నా కంటికి కనిపించలేదు. కాని, గుండెల్లో ఓ మూల లీలగా ఆ బొంగురు కంఠం రోజంతా వినిపిస్తూనే ఉంది.

* * *

నగరాల్లో బ్రతికే మనుషులకు ఆదివారం ఫుల్ వర్కింగ్ డే!

పేరుకి అదే నగరంలో ఉంటున్నా పాతిక ముప్ఫై మైళ్ళు తక్కువ కాని దూరంలో మన స్నేహితులో, చుట్టాలో ఉంటారు. ఆ రోజంతా వాళ్ళని చూడడానికి వెళ్ళటానికో, వాళ్ళు వస్తే వాళ్ళ సత్కారాలకో కాలం సరిపోదు కదా తక్కువే అవుతుంది. కాసేపు పార్కులో కూర్చోవాలన్నా, లైబ్రరీ కెళ్ళాలన్నా, సినిమా చూడాలన్నా, ఆఖరికి దేవుడి గుడి కెళ్ళాలన్నా ఆదివారమే పిలవుతుంది. వారంలో ఆరు రోజులు యంత్రంలా బ్రతికిన నగర జీవి ఆదివారం రోజున మనిషిగా మారి తన అభిరుచుల్ని, అభీష్టాలని నెరవేర్చుకుని సోమవారం తెల్లారగట్ల మళ్ళా యంత్రంగా మారిపోతాడు. ఆ రోజున నేను మనిషిగా మారి నాకు 'కాకెంగిలి' దగ్గర్నుంచి మిత్రుడైన వెంకోజీ గురించి ఎదురు చూస్తున్నాను.

వెంకోజీ మా ఊళ్ళో నా కంటే మూడు రోజుల ముందు పుట్టి బొంబాయిలో మూడేళ్ళు ముందుగా ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఓ విధంగా నన్ను బొంబాయి రప్పించింది వెంకోజీయే! కాని, అతి విచిత్రమైన విషయం—మా ఇద్దరివీ భిన్న మనస్తత్వాలు; రెండు విడి స్వభావాలు. ఎదుటి వాణ్ణి ఎదిరించటంలో ఆనందం పొందుతాడు వెంకోజీ. ఎదుటివాడితో ఏకీభవించటంలో ఆనందం వెతుక్కుంటాను నేను. వాడు బొంబాయి నాగరికతలో కలిసిపోయి తెలుగుదేశం మరిచిపోయి చీకూ చింతా లేకుండా హాయిగా కాలం గడిపేస్తున్నాడు. కాని, క్షణక్షణానికి నాకు మా ఊరు జ్ఞాపకం వస్తుంది. మా ఊరి రోడ్లంటే నా కెంతో ఇష్టం. అక్కడి చెరుకు తోటలు, వరిచేలు, కాలవగట్టు, తామరాకులో వేడి పొగలు గక్కే సీతాలు ఇడ్లీ నాకు ప్రాణం. స్వభావంలో మేమిద్దరం రెండు ధ్రువాలైనా, వాడిని నేను వదిలి ఉండలేక పోవటానికి కారణం వాడు మా ఊరివాడు కావటమే. అతగాడి మోజులో నాకు సజీవంగా కదలాడే నరిసేపట్నం కనిపిస్తూ ఉంటుంది.

వెంకోజీ అనుకున్న టైముకు దిగాడు. మెట్లెక్కి వస్తూనే చెప్పులు లోపల విడిచి వెన్ను మీద చరిచి అన్నాడు:

"ఎన్నాళ్లయిందిరా నిన్ను తన్ని!" పదునైన మాటలతోనే కాకుండా ఇలా బలిష్ఠమైన చేతలతో కూడా వాడు తన ఘాటు ప్రేమను వెలువరిస్తుంటాడు.

"వారమే అయింది."

"వారం అయిందా?"

"మాటలు తరవాత. నీకోసం డికాక్షన్ కాఫీ ఉంది వేడిగా. సేవిద్దాం పద."

ఇద్దరం కిచెన్‌లోకి వెళ్ళాం. పాలు కలపని కాఫీ వాడికి ప్రాణం! నాకు ప్రాణ సంకటం. వాడికోసం నేను ఆ సంకటాన్ని ప్రాణంగా మార్చుకున్నాను. అమృతం సేవిస్తూ వాడు మాటల్లో పడ్డాడు. ఔషధం కానిస్తూ నేను వాడి మాటలు వింటున్నాను. ఇంతలో మేం త్రాగటం పూర్తికాకుండానే బిల్డింగ్ క్రిందనుంచి దగ్గరగా ఓ కంఠం పాట పాడటం వినిపించింది.

'గోదారి గట్టుంది, గట్టుమీదన పెట్టుంది.'

నేను దిగ్గున లేచాను.

అదే కంఠం, ఆ రోజు ట్రెయిన్‌లో విన్న బొంగురు కంఠం.

"అదా? వాడూ తెలుగు ముష్టోడు. పాటలు పాడి అడుక్కుంటూంటాడు."

"తెలుగు ముష్టోడా?"

"అవును. అయిదారు సంవత్సరాలై బొంబాయి వచ్చినా వాడికి మరాఠీగాని, బొంబాయి గాని పట్టుపడలేదు. అందుకే తెలుగు పాటలు పాడి అడుక్కుంటూంటాడు. వాడి మూలంగా మన పరువు పోతోంది." వెంకోజీ అన్నాడు.

"ఏం? ఎందుకు?" నే నడిగాను.

"ఎందుకేమిటి? బొంబాయి నగరమంతా వాణ్ణి తెలుగు వాడుగా గుర్తించేసింది. దానివల్ల మన తెలుగు జాతికే అవమానం కదూ?"

"అవమానమా?"

"కాదా?"

నేను మాట్లాడలేదు.

గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర, ఫోర్ట్ ఏరియాలో, ఫ్లోరా ఫౌంటెన్ సెంటర్లో, మలబార్ హిల్ ప్రాంతంలోనూ ఇంగ్లీషులో బెగ్ చేసే బిచ్చగాళ్ళను నేను చాలా మందిని చూశాను. మా ఊళ్ళో తమిళులు కొందరు వచ్చి యాచించటం నే నెరిగిన విషయమే. అడుక్కోవటం ఆ మనిషికి అవమానం కావచ్చు కాని, అతని జాతికి ఎందు కవుతుంది? కాని, వెంకోజీని ఎదిరించటం నాకు చేతకాదు.

అతన్ని చూద్దామని వరండాలోకి నడిచాను.

"ఒయ్! అతని ఊరు గాడిచెర్లట. నీకు దగ్గర వాడేలే. చూసి ఆనందించు." వెనకనించి వెంకోజీ అన్న మాటలు నాకు మరీ హుషారు నిచ్చాయి. వరండా పిట్ట గోడల మీద చేతులానించి నేను క్రిందకు చూశాను. అతను తెలుగు పాటలు దంచేస్తున్నాడు. మధ్య మధ్యలో అర్థంలేని నాట్యం దానికి మిళితం చేస్తున్నాడు. మా బిల్డింగు పిల్లలు కొందరు అతని వెనక చేరి గెంతుతున్నారు. కొందరు చపాతీలు విసురుతున్నారు. అతని బట్టలు చిరిగిపోయాయి. గెడ్డం మాసిపోయింది. వయస్సు ముప్ఫై ఉండవచ్చు.

"పైకి పిలవనా?" వెంకోజీని నే నడిగాను.

"పళ్ళు రాలతాయి."

వెంకోజీ అన్నంత పని చేసేటిరే రకం!

జేబులోంచి అర్ధ రూపాయి తీసి విసిరాను. ఓ గెంతు గెంతి అది తీసుకుని సలాం పెట్టాడతను.

"వాళ్లేరా." వెంకోజీ అరుపుకి వంటింట్లోకి వచ్చేశాను.

"అతని ఊరు గొడిచెర్లా?" లోపలి కొస్తూనే అడిగాను.

"అవును"

"నీ కెలా తెలుసు?"

"ఓ సారి అడిగాను."

"మాట్లాడావా?"

"ఆఁ అందుకే కనిపించినప్పుడల్లా పల్కరిస్తాడు."

"పోన్లెద్దూ."

"ఏం పోనీయ్? వాడెంత మనమెంత?"

"ఎంతైనా తెలుగువాడు. జాలి పడితే తప్పేముంది?"

"తెలుగువాడైతేనయ్యంలే, ఎప్పుడైనా వాడి నరిసీపట్నం అని చెప్పేవు జాగ్రత్త. ఇంట్లో దూరేయగలడు."

వెంకోజీతో వాదించి ప్రయోజనం లేదు. వాడిని నొప్పించటం నా కిష్టం లేదు. ఆ తెలుగు ముష్టతన్ని మరోసారి కలిసినప్పుడు పలకరించాలని నిశ్చయించుకున్నాను.

"చూడబ్బాయ్! ఇక్కడ కామాటీపురం అని ఓ నరకం ఉంది. అక్కడ ఇలాంటి తెలుగువాళ్ళు చాలా మంది ఉన్నారు. వ్యభిచారులుగా కాలం వెళ్ళబెట్టేవాళ్ళు కొందరైతే, కామాటీలుగా బతికే వాళ్ళు కొందరు."

"కామాటీలా?" నే నడిగాను.

"అవును. కామాటీ అంటే ఇంట్లో అంట్లు తోమే పనిమనిషి అని అర్థం. ఈ మహా నగరంలో తెలుగువాళ్ళ స్థానం అంతే." వెంకోజీ మాటలకు నేను నివ్వెరపోయాను.

"నిజమా?"

"అబద్ధం ఆడటం ఇహముందు మొదలు పెట్టాలి."

ఆ పూటంతా వెంకోజీ తెలుగుజాతి దౌర్భాగ్యం గురించి, వాళ్ళ లోపాల గురించి, వాళ్ళ అనైక్యత గురించి నా తల వాచేలా వివరించాడు. మధ్య మధ్యలో నే మనవి చేసిన మానవజాతి ఔన్నత్యం వాడి వాదనకు బలం చేకూర్చిందే తప్ప వాడి చిన్న చూపును పెద్దది చెయ్యలేక పోయింది.

* * *

మెరైన్‌డ్రైవ్ ప్రకృతి అందానికి ఎంత అలంకారం చేకూర్చిన మానవ నిర్మాణం. మలబార్ హిల్ మీద మెరిసే నియాన్ ఎడ్వర్టైజ్‌మెంటు బోర్డులు, రోడ్డుపక్కగా మెలిచిన స్కైస్క్రేపర్లు, బీచ్‌లోని పెట్రొమాహ్రడొములు ఆ నిర్మాణపు సోయగాన్ని మరింత ఇనుమడింప జేస్తాయి. ఆఫీసు కాగానే కాసేపు చౌపాటీలో కూర్చుందామని బయలుదేరాను. బ్రిడ్జిమీద తెలుగు ముష్టాడు కూర్చున్నాడు.

తన మామూలు ధోరణిలో బొంగురుగా పాడేస్తున్నాడు. అతని దగ్గరగా వెళ్ళి ఆగాను. తేరిపార చూశాను.

"నించో" అన్నాను.

"మీరు—"

"తెలుగువాణ్ణే. మాటలు తరవాత. నా వెనకరా."

ఇంకేం మాట్లాడకుండా చౌపాటీలో కెళ్ళి కూర్చున్నాను. నాకు కొంచెం దూరంలో అతను కూర్చున్నాడు.

"నీ పేరు?" నే నడిగాను.

"జోగులు."

"నువ్వేం చేస్తూంటావు?"

"అడుక్కుంటూ ఉంటాను."

"అది నీ వృత్తా?"

"కాదు. వేరే పని దొరకక."

"మాదీ నరిసీపట్నమే, తెలుసా?" చటుక్కున అన్నా న్నేను.

"నరిసీపట్నవా?" అని జోగులు ఆత్రతగా నా మొహంలో ఏదో వెతకటం ప్రారంభించాడు. నాకు తెలుసు, అతను నా మొహంలో గొడిచెర్ల పొలిమేరలు చూడగలడు. నా ఊహ నిజమైంది. అతని కళ్ళు ఆనందంగా వెలిగాయి.

"ఇన్నేళ్ళకి మన వేపు వాళ్ళని చూడగలిగాను, బాబూ." అతని ఆనందం నాకు ఆనందం కలిగించింది.

"నీ కెవరూ లేరా?" అతన్ని అడిగాను.

"ఉన్నారు బాబూ. అమ్మ, చెల్లెలు గొడిచెర్లలో ఉన్నారు. డబ్బు గడించవచ్చని ఇంట్లో చెప్పకుండా రైలెక్కేశాను. చివరికీ స్థితి కొచ్చాను. నా కిప్పుడు ఒక్కటే భయం, బాబూ— జీవితంలో తిరిగి నా వాళ్ళని నేను కలవగలనా అని."

నాకు జాలేసింది. అతనికి ధైర్యం చెప్పాను.

"ఏదైనా పని ఇప్పిస్తే చెయ్యగలవా?"

"ఓ."

"ఇంట్లో పనులైనా?"

"ఫస్టుగా చేస్తానండీ." అతను కొండంత సంబరపడ్డాడు.

"నువ్వెక్కడ ఉంటున్నావు?"

"కామాటీపురంలో."

"అడ్రెను?"

"మీరు రాలేరు, బాబూ! నేనే తమరి దగ్గరి కొస్తా."

"సరే."

ఆ మరునాడు జోగుల్ని శుభ్రంగా తయారుచేసి మా లాండ్ లేడీ ఫిలిమినాకు చూపించి ఆమె ఇంట్లో పనివాడుగా కుదిర్చాను. ఇప్పుడు మా ప్రాంతం అతను నా కళ్ళముందే మసలుతూంటాడు. వెంకోజీకి ఫోనులో ఈ వార్త చెప్పి వాడి జవాబు కోసం ఎదురు చూడకుండా ఫోను పెట్టేసి దూరంగా పరుగెత్తి కెళ్ళిపోయాను. నే ఫోను పెట్టేసిన అయిదు నిమిషాలకే అది కాస్త ముక్కలైన మాట వాస్తవమే కాని, దానికి కారణం అవతల "యూ స్టుపిడ్" అని అరిచిన వెంకోజీ నోటి పవరో లేక మా లాండ్ లేడీ చెయ్యి జారిన పొరపాటో నా కిప్పటికీ సస్పెన్సుగానే మిగిలింది.

* * *

అదృష్టం అంటే నాకు మా పెద్ద నమ్మకం. మా ఆఫీసువాళ్ళు నన్ను అర్జెంటుగా తమ సొంత ఖర్చులతో టిక్కెట్టు రిజర్వు చేయించి పది రోజులు డ్యూటీమీద విశాఖపట్నం పంపించటానికి నిర్ణయించారని తెలియగానే నా నమ్మకానికి ఆధారం దొరికినట్లైంది. ఈ సంతోషవార్త వెంకోజీకి వినిపించి సాయంత్రం ఇంటికి చేరాను. వెంకోజీ కూడా పది రోజులు సెలవు పెట్టి నాకు సాయం వస్తానన్నాడు నా అభ్యర్థనపై. జోగులుకుకూడా చెప్పా నీ విషయం.

"నేను మనూరి వైపు వెళుతున్నాను."

"ఎప్పుడు?"

"పది రోజుల్లో."

"మీరే మనుకోకపోతే నా కో ఉపకారం చెయ్యాలి." అర్థిస్తున్నట్లు అన్నాడు.

"చెప్పు."

"ఒకసారి గొడిచెర్ల వెళ్ళి మా అమ్మని, చెల్లెల్ని చూసి రండి."

"నేనా?"

"మీకు వీలుంటేనే. మీరు చూస్తే నేను చూసినంత సంతోషం నాకు. ఆరేళ్ళ నించి అనుకుంటున్నాను."

అతని ఆత్రత నా కర్థమైనంతగా మరెవరికీ అర్థం కాదేమో! అంగీకరించాను. సంతోషంతో తబ్బిబ్బైపోయాడు. వెళ్ళే రోజు ఉదయం ఓ జాకెట్టుగుడ్డ, పూసల దండ నా చేతి కిచ్చి అన్నాడు:

"ఈ జాకెట్టుగుడ్డ మా అమ్మ కివ్వండి. ఈ పూసలదండ మా చెల్లెలికి. వాళ్ళతో చెప్పండి నా స్థితి ఇప్పుడు బాగుందని. తొందర్లో డబ్బు గడించి వస్తానని, చెల్లెలు పెళ్ళి చేస్తాననికూడా చెప్పండి."

రైలుస్టేషనుకు మా ఇద్దరినీ సామాన్లు మోసుకురావడం వల్ల వెంకోజీ జోగుల్ని పెద్దగా ఏమనలేదు. రైలు వి. టి. స్టేషన్ వదిలే వరకూ అతను ఉండి వీడ్కోలు ఇచ్చాడు.

* * *

నా కిచ్చిన ఆఫీసుపని రెండు రోజుల్లో ముగిసింది. మా కంపెనీ వాళ్ళ దయవల్ల నేను మిగతా వారం రోజులు స్వేచ్ఛగా ఎగురుతూ జల్సాగా తిరుగుతూ, గడప వచ్చు. విశాఖపట్నం నుంచి నర్సీపట్నం వచ్చి వెంకోజీని కలిశాను. మా ఊరిని పూర్తిగా చూసుకున్న తరవాత తీరిగ్గా వెంకోజీని అడిగాను:

"మనం ఒకసారి గొడిచెర్ల వెళ్ళాలి."

"ఏమన్నా స్నాప్పు తీసుకుందామా?"

"అవును."

వెంకోజీకి అప్పటికి నిజం చెప్పటానికి భయం వేసింది. స్నాప్పు తీసే మిషతో జోగు లిచ్చిన జాకెట్టు గుడ్డ, పూసల దండ తీసుకుని బయలుదేరాను. బస్సు దిగిన తరవాత నిజం చెప్పాను.

"క్షమించరా, వెంకోజీ! నీకు చెప్పకుండా వేరే పనిమీద ఇక్కడి కొచ్చాను."

"వేరే పనా?"

"అవును. జోగులు వాళ్ళ వాళ్ళని కలుసుకుని రమ్మన్నాడు."

"తెలుగు ముష్టాడా?" అని మండి పడ్డాడు. విసుక్కున్నాడు. నన్ను తిట్టాడు. చేసేది లేక నా వెంట బయలుదేరాడు.

జోగులు చెప్పిన గుర్తుల ప్రకారం రచ్చబండ తూర్పు వైపు తాటాకింటి కేసి దారి తీశాం. రచ్చబండ మీద ఇద్దరు పల్లీయులు చుట్టలు కాల్చుకుంటూ ఉబుసులాడుకుంటున్నారు. మమ్మల్ని చూడగానే పలకరించారు.

"ఎవురి గురించి బాబా?"

"కనక మా లక్ష్మమ్మని, జోగులు తల్లి. ఆమె గురించి."

"కనక మాలచ్మా? బావా! ఏడాద్దాటి పోయిందిగా పోయి?" అందులో ఒకతను అన్నాడు.

నేను షాక్ తిన్నాను!

"మరి కూతు రేమైంది?" వెంకోజీ అడిగాడు.

"ఏరో బావా, సుక్క కావాలంట."

"సుక్కా!" అంటూ ఫకాలున నవ్వారు వాళ్ళు. మా ఇద్దరికీ అర్థం కాలేదు.

"యా ఊరు మంది?" రెండో అతను అన్నాడు.

"ఏ ఊరైతే నేం? ఏమైందో

చెప్పండి ముందు." ఆత్రంగా అడిగాను నేను.

"కొత్తపేటెళ్ళండి. తాయారు భోగంమేళంలో ఉంటుంది."

స్తంభించిపోయాను. గిరుక్కున వెనక్కి తిరిగాను. చెప్పలేని నీరసం, నిస్సత్తువ నన్నావహించాయి. నే పట్టుకున్న జాకెట్టుగుడ్డ, పూసలదండ కణకణలాడే నిప్పుకణికల్లా నా చేతుల్ని కాల్చేస్తున్నాయి. నే విన్న వార్త నరనరాల్లో ప్రవహించి గుండెను దహించేస్తోంది!

నన్ను నడిపించాడు వెంకోజీ.

బస్సు ఎక్కి గొడిచెర్ల పొలిమేర దాటుతుండగా నేను భరించలేని జాకెట్టు గుడ్డనూ, పూసలదండనూ ఎవరూ చూడకుండా కసిగా విసిరేశాను. నరిసీపట్నంలో దిగేదాకా నన్ను మాట్లాడించలేదు వెంకోజీ. బస్సు దిగిన తరవాత నన్ను ఓదార్చాడు.

"డోంట్ బి టూ సిల్లీ! ఏమైందిప్పుడు? ఆఫ్టరాల్ హి ఈజ్ ఎ బెగ్గర్. వాడి విషయంలో నువ్వింత ఇంటరెస్టు తీసుకోవటమే తప్పు. తీసుకున్నావు. డ్రాప్ ది మేటర్". వెంకోజీ ఓదార్పు మాటలకంటే జోగులు ఆశలే నా మనస్సులో గిర్రున తిరుగుతున్నాయి. ఈ నిజం తెలిస్తే జోగులు ఏమైనా అయిపోతాడు. జోగులు ఉత్సాహంగా బతకాలంటే ఒక్కటే మార్గం. మాకు తెలిసిన నిజాన్ని పాతిపెట్టి అతను సంతోషించే అబద్ధాలు చెప్పటం. అదే చెయ్యటానికి నిశ్చయించుకున్నాను.

*  *  *

రైలు పూనా దాటగానే నా మనస్సు ఆందోళనతో నిండిపోయింది. కళ్యాణ్ ప్రవేశించగానే జోగులు నాకు పెద్ద ప్రశ్నార్థకంగా తయారయ్యాడు. అతనికి అబద్ధం చెప్పి ఎంత కాలం మభ్యపెట్టగలను? వి. టి. స్టేషన్లో అతను నా కోసం ఎదురు చూస్తుంటాడు. అతన్ని ఎదుర్కొనే ధైర్యం లేక దాదర్‌లో దిగిపోయి టాక్సీలో ఇంటి కెళ్ళిపోయాను. నే ఇంటి కొచ్చిన రెండు గంటలకు జోగులొచ్చాడు. వస్తూనే అన్నాడు:

"మా అమ్మని, చెల్లెల్ని చూశారా?"

నేను నిలవిలలాడిపోయాను.

"ఊఁ" అన్నాను చివరకు.

"బాగున్నారా? నే పంపిన డబ్బిచ్చారా?"

"ఆఁ." నూతిలోంచి వచ్చినట్లుంది నా మాట.

"ఏమన్నారు?"

"నిన్ను సుఖంగా బతకమన్నారు. వాళ్ళ గురించి బెంగపడద్దన్నారు."

"మా ఊరి పొలాలు, రోడ్లు,



రచ్చబండ అన్నీ ఉన్నాయా? ఏమన్నా మారాయా?"

"అన్నీ బాగా ఉన్నాయి."

"ఏం బాబూ, అలా ఉన్నారు? తలనొప్పా?'

"అవును, జోగులూ. కొంచెం రెస్టు తీసుకుంటాను.'

*  *  *

ఆ రోజునుంచి నా కళ్ళ ముందు తిరగాలనుకున్న మా ప్రాంతం జోగులు కళ్ళనించి తప్పించుకు తిరగడం నాకు సమస్యగా తయారయింది. ఒక్క క్షణం ఖాళీ ఉంటే చాలు జోగులు తన వారిని గురించి ప్రశ్నలు గుప్పించేస్తున్నాడు. నాలో ఆ భయంకరమైన నిజాలని దాచుకోలేక, అతని ప్రశ్నలకు జవాబులు చెప్పలేక సతమతమై పోతున్నాను. అతనికి సాధ్యమైనంత దూరంగా వెళ్ళిపోతున్నాను. ఓ రోజు సాయంత్రం నేను ఆఫీసు నుండి వచ్చేసరికి మా వరండాలో లాండ్ లేడీ గొంతు గట్టిగా వినిపిస్తోంది.

"బ్లడీఫూల్! స్టుపిడ్."

ఆ వెంటనే వెంకోజీ గొంతు వినిపించింది.

'ముష్టివెధవ! హద్దులు తెలిసి ప్రవర్తించు.'

ఏదో గట్టి గొడవ లాగే ఉంది. నేను గబగబా వరండాలో కొచ్చాను.

దోషిలా జోగులు నించున్నాడు. అతని చేతిలో కొండపల్లి బొమ్మ! వెంకోజీ, మా లాండ్‌లేడీ తోక తొక్కిన పాముల్లా నిలుచున్నారు.

"అదిగో వచ్చాడు గొప్పోడు! చేర్చావుగా నెత్తి కెక్కి. చూడు, ఏం చేశాడో మీ గొడిచెర్ల గాడిద." వెంకోజీ అన్నాడు.

"ఏమైంది?" విషయం తెలియక నే నడిగాను.

"అయ్యేదేముంది? దొంగతనానికి దిగాడు."

"అవును. నా బొమ్మ తీసుకెళ్ళిపోవటానికి పేపర్లో చుట్టాడు." లాండ్‌లేడీ ఇంగ్లీషులో అంది.

"జోగులూ! నిజం చెప్పు."

"నేను దొంగతనం చేద్దామని తియ్యలేదు, సార్. ఈ కొండపల్లి బొమ్మ రంగు వెలిసిపోయింది. పెళ్ళికూతుర్లా రంగు వేసి ముస్తాబు చేద్దామని తీసుకెళుతున్నాను. ఇంతట్లోకి వీళ్ళిద్దరూ చూసి మరోలా అనుకున్నారు!" జోగులు మాటలతో నా గుండెల్లో ఓ మూల అతని చెల్లి కదిలింది. నాకు సెంటిమెంట్స్ మీద నమ్మకం ఉంది.

"ఏం చెప్పకయ్యా! నా కంతా తెలుసు నీ గురించి. అయిదేళ్ళుగా దర్జాగా అడుక్కు తిన్నావు బొంబాయి నగరాన్ని. కష్టపడాలంటే నీకు ఒళ్ళు వంగదు. అందుకే మీ వాళ్ళ బతుకు అధ్వాన్నమైపోయింది." వెంకోజీ కోపంగా అరిచాడు.

"మా వాళ్ళ బతుకా?" జోగులు విస్మయంగా అడిగాడు.

నాకు కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు. వెంకోజీ ఆగే స్థితి దాటిపోయాడు.

"ఆఁ. అవును. ఇదిగో, ఈ ప్రబుద్ధుడు ఇంత కాలం నిన్ను మభ్య పెట్టినా నేను నిజం దాచను. నీ అమ్మ చచ్చి చాలా రోజులైంది. నీ చెల్లెలు కొత్తపేట తాయారమ్మ భోగం మేళంలో చేరి ఏడాదైంది."

నాకు దాదాపు స్పృహ తప్పింది.

జోగులు చేతిలో బొమ్మ తాపీగా కింద పెట్టి వేగంగా వీధిలోకి పరుగెత్తాడు. నే తేరుకునే సరికి కనుచూపు మేరలోకూడా లేడు.

*  *  *

నాలుగైదు రోజులు గడిచినా జోగులు జాడ లేదు.

ఈ నాలుగు రోజులు నేను వెంకోజీతో మాట్లాడలేదు. రెండు మూడు సార్లు ఫోన్ చేసినా మాట్లాడకుండా ఫోను కింద పెట్టేశాను. చిట్టచివరికి జోగులు జాడ కోసం నేనే కామాటిపురం బయలుదేరాను. బొంబాయి వంటి భూతల స్వర్గంలో వెలసిన నరలోక నరకం కామాటిపురం. మురికిరోడ్లు, వలుదిశలా దుర్గంధం, గట్టర్స్ లోంచి అదీనం తప్పిన బురద, క్రిక్కిరిసిన ఆకలి జనం. పిచ్చికగూళ్ళు లాంటి ఇళ్ళు. ఆ ఇళ్ళలో తేనెపట్టు అరలాంటి చాటాలు. ఆ చాటాల గదుల్లో బీరువా అరల్లా మలక మంచాలు. అవి దాటుకుంటూ తెలుగు ప్రెస్ పక్క సందులోకి నడిచాను. ఎంక్వైరీ చెయ్యగా సగం కూలిపోతున్న ఓ క్వార్టర్స్ ఇల్లు జోగులుండే చాటాగా తెలిసింది. ఆ ఇంటి యజమానిని అడిగాను, జోగులు గురించి. అతను చెప్పినదంతా విని ఇవతలి కొచ్చాను. వెంకోజీకి వెంటనే ఫోన్ చేశాను.

"వెంకోజీ! నువ్వు నిత్యం అసహ్యించుకునే గొడిచెర్ల గాడిద ఇన్నాళ్ళకి నువ్వు మెచ్చుకునే పని చేశాడు. ఏమిటో తెలుసా? ఇంకెప్పుడు నువ్వు మన జాతి ఔన్నత్యాన్ని కించపరుస్తూ, అవమానం కలిగేలా అడుక్కునే తెలుగు ముష్టిణ్ణి బొంబాయి నగరంలో చూడవు. నీ మాటల ఘాటులో విషం తిని ఆఖరి చూపుకూడా మనకు దక్కనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు." ★